సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 20 ၊ సెప్టెంబర్ ၊ 2023



ముగిసిన పెద్ద దర్గా ఉరుసు

పెద్ద దర్గాలో హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. -8లో..



ఎర్రచందనం దుంగల స్వాధీనం

లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను మంగళవారం అటవీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌వో వివరాలు వెల్లడించారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 313 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్: టపాసుల విక్రయాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15 లోగా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కొత్త లైసెన్స్‌కు ఫారం ఎల్‌ఈ–5 దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే గత సంవత్సరం ఫారం ఎల్ ఈలో లైసెన్స్ పొందిన వారు రెన్యువల్ కోసం ఫారం ఆర్‌ఈ–1తో పాటు రూ.500లు (సీఎఫ్‌ఎంఎస్)లో చలానా చెల్లించి రెవెన్యూ డివిజనల్ వారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. అలాగే ఆర్‌డీఓ కార్యాలయ అధికారులు, తహశీల్దార్ అధికారులు సూచించిన ప్రదేశంలోనే టపాసులు విక్రయించాలని అలా కాకుండా ఇతర ప్రదేశాలలో విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

20 నుంచి ప్రత్యేక సదరం క్యాంపు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్ తెలిపారు. కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రత్యేక సదరం శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పీలేరు, రాయచోటి, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులలో ఈనెల 20, 22వ తేదీల్లో ఆర్థోపెడిక్‌కు సంబంధించిన కొత్త కేసులు మాత్రమే పరీక్షించి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. అలాగే ఈనెల 21, 23వ తేదీల్లో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి, చెవి, ఎముకలకు సంబంధించిన కేసులు చూస్తామని వివరించారు. క్యాంప్ రోజున ఆస్పత్రిలోనే స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

గజవాహనంపై శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటిటౌన్: శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి గజవాహనంపై ఊరేగారు. మంగళవారం శ్రీ వీరభద్ర స్వామి జయంతి సందర్భంగా స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రంగు రంగు పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకీలో ఆలయ వీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని తమ కార్యాలయంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ మేళాకు అపోలో ఫార్మసీ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, ఎల్‌ఐసీ సంస్థల ప్రతినిధులు వస్తారన్నారు. అపోలో ఫార్మసీ కంపెనీలో హెచ్‌ఆర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్, ఫారాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ డిప్లొమా కలిగి 19–30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు.

గండి హుండీ ఆదాయం లెక్కింపు



గండి ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ సహాయకమీషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.33 రోజులకు గాను రూ.34,24,967ల నగదు,17 గ్రాముల 300 మి.గ్రా బంగారుతో పాటు 643గ్రాముల వెండి వచ్చినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో కడప దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్,ఆలయ ప్రధాన, ఉపప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజా రమేష్,రాజగోపాలాచార్యులు సిబ్బంది, చక్రాయపేట ఏపీజీబి మేనేజర్ అశోక్,కుమార్,ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం..రా

ఆట ఏదైనా ఆంధ్ర పేరు వినబడాలా... అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పేరు మార్మోగాలా.. దీని కోసం వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యంగా వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు వెన్నంటి నిలబడడమే కాదు వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు నడుం బిగించింది. క్రీడాసక్తి కలిగి.. ప్రతిభ కలిగిన 17 ఏళ్లలోపు ఆటగాళ్లను మైదానాల బాట పట్టించనుంది. 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో 46 రోజుల పాటు పోటీలను నిర్వహించనుంది.

- ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'
- గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు
- ఐదు క్రీడాంశాల్లో 46 రోజుల పాటు ఉత్సవాలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మదనపల్లె సిటీ: సరైన ప్రోత్సాహం లేక అనేక మంది ఇప్పటివరకు క్రీడా వేదికల్లో పాల్గొనలేక పోయారు. ఈ నేపథ్యంలో ఆయా క్రీడల్లో ప్రతిభ కలిగిన ఆటగాళ్లను గుర్తించి భవిష్యత్తు క్రీడాకారులుగా తయారు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని 17 ఏళ్లలోపు వారిలో క్రీడాసక్తిని మరింత పెంచి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకుం దుకుగానూ 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడోత్సవాలకు శ్రీకారం చుడుతున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 46 రోజుల పాటు గ్రామ,వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు రకాల పోటీలను నిర్వహించనున్నారు.

సన్నాహాలు షురూ...

క్రీడ సంబరాలకు సంబంధించి ప్రణాళికను కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిద్ధం చేస్తోంది. 'ఆడుదాం ఆంధ్రా ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. పోటీలను ఘనంగా .. ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిపేందుకు క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ ఇలా...

గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల్లో పోటీలను నిర్వహించనున్నారు తొలుత సచివాలయ, ఆపై మండల, అనంతరం నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలను జరపనున్నారు. పోటీలకు ముందే గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. బాల,బాలికలకు క్రీడాపరికరాలనూ అందజేయనున్నారు. గ్రామస్థాయిలో యువజన సంఘాలు భాగస్వాములయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడా ప్రాధాన్యంపై అవగాహన కల్పించి గ్రామీణ యువత పోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టనున్నారు.



కోచ్‌ల భాగస్వామ్యం

జిల్లాలో 501 గ్రామ,వార్డు సచివాలయాల నుంచి జట్లు పాల్గొననున్నాయి. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు దాదాపు 200 మంది పీడీలు,పీఈటీలతో పాటు క్రీడాప్రాదికార సంస్థకు చెందిన కోచ్‌లు భాగస్వామ్యులు కానున్నారు.

క్రీడాంశాలు

జిల్లాలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్,బ్యాడ్మింటన్‌లో పోటీలను నిర్వహించనున్నారు. 17 ఏళ్లలోపు వారే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఒక్కో క్రీడాకారుడు రెండు క్రీడాంశాల్లో పాల్గొనవచ్చు. నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించనున్నారు. బాల,బాలికలకు పోటీలను వేర్వేరుగా జరపనున్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి..నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు వివిధ ప్రభుత్వాధికారుల నేతృత్వంలో క్రీడాప్రాధికారిక సంస్థ పోటీలను నిర్వహించనుంది.

క్రీడాకారులకు మంచి అవకాశం

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ఈ కార్యక్రమం క్రీడాకారులకు మంచి అవకాశం. క్రీడలపై గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు మరింత ఆసక్తిని పెంచుకునేందుకు ఇది దోహదపడుతుంది. మైదానాలు, ఆటలు, క్రీడాకారుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నాం. పోటీలను పకడ్బందీగా నిర్వహించనున్నాం.

–సాయిగ్రేస్, జిల్లా స్టెప్ అధికారి, అన్నమయ్య జిల్లా

23 నుంచి ఎస్‌జీఎఫ్ అండర్-19కు ఎంపికలు



కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ అండర్–19 క్రీడలకు ఉమ్మడి జిల్లాల పరిధిలో అర్హులను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగం జిల్లా కార్యదర్శి పి.శారద తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో 24 క్రీడాంశాలకు సంబంధించిన ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల జాబితా తీసుకురావాలని సూచించారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
23–09	కరాటే, తైక్వాండో, స్కేటింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వేకోడూరు
24–09	సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్	ఏపీ మోడల్ కళాశాల, పుల్లంపేట
25–09	స్కిప్పింగ్, ఫెన్సింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వేకోడూరు
26–09	త్రోబాల్, యోగ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్	మేధా జూనియర్ కళాశాల, మైదుకూరు
27–09	అథ్లెటిక్స్	మేధా జూనియర్ కాలేజి, మైదుకూరు
30–09	ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, రగ్బీ, బాస్కెట్‌బాల్	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గండి
03–10	టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, టెన్నిస్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, పులివెందుల

ఓటరు జాబితాపై ఫిర్యాదుల పరిశీలన

- 90 శాతం పైగా పరిశీలన పూర్తి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను 90 శాతానికి పైగా పరిశీలన పూర్తి చేశామని కలెక్టర్ గిరీషా పీఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు వివరించారు. మంగళవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి '2024 ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ'కు సంబంధించి రీ వెరిఫికేషన్ ఆఫ్ ఎలక్టోర్స్, ఫామ్ 6, 7, 8 తొలగింపు, ఇంటింటా సర్వే, నకిలీ, 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న డోర్ నెంబర్స్, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్, ఎపిక్ కార్డ్స్ జనరేషన్, ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీ నుంచి 4,0358 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫిర్యాదులన్నింటికీ సంబంధించి 90 శాతం మేర పరిశీలన పూర్తి చేశామని వివరించారు. రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదుల్లో చనిపోయిన 18936 శాశ్వతంగా బదిలీ అయిన ఓటర్లు 3799 ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటినీ ఇంటింటి సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలగింపులకు సంబంధించి పరిశీలన పూర్తయిందన్నారు. ఫారం 6లో 15 శాతం, ఫారం 7లో 17 శాతం, ఫారం 8లో 6.3 శాతం పెండింగ్ ఉందని వీటిని కూడా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలతో ఈ నెల 20న జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఈ నెల 22న తుది జాబితాను ఎలక్షన్ కమీషన్‌కు పంపిస్తామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా మాట్లాడుతూ అక్టోబర్ 17 నాటికి ఓటర్ జాబితా కరెక్షన్స్ అన్నిటినీ పూర్తి చేసి పబ్లిష్ చేయాల్సి ఉంటుందని సూచించారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ జాబితాకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ రంగస్వామి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓలు, మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉంటే మెడికల్ ఆఫీసర్‌ల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలన్నారు.

20న 'జగనన్నకు చెబుదాం'

ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారంకోసం కోసం మండలస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. జిల్లా పరిధిలోని పెనగలూరు మండల కేంద్రంలో ఈనెల 20వ తేది బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

వాతాపి గణపతిం భజే..

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ఊరంతా సందడి
- తిరునాలను తలపించిన భక్తజనం



మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులో రక్తదాతగా వినాయకుడు

కడప కల్చరల్ : ఆది పూజల దేవుడు, శివపార్వతుల ముద్దుల తనయుడు గణనాథుడు, సిద్ధి, బుద్ధి ప్రదాత, విఘ్న నాయకునికి సోమ, మంగళవారాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. విగ్రహాలుగల పందిళ్లన్నీ ఉదయం, సాయంత్రం భక్తజనంతో పోటెత్తాయి. పిల్లలు, పెద్దలు నిలువెత్తు గణపతి మూర్తులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు ఇళ్లలో పూజలు నిర్వహించే సమయంలో తమ పాఠ్య పుస్తకాలను పూజలో ఉంచారు. తమకు చదువులు బాగా రావాలని కోరుకున్నారు. కుటుంబాలతోసహా ఉదయం, సాయంత్రం సమీపంలోని వీలైనన్ని పందిళ్లలోని స్వామిని దర్శించుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పౌరాణిక, భక్తి నాటక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భజనలు నిర్వహించారు.

మట్టి గణపతి మనసా స్మరామి

వినాయక చవితి నాడు మట్టి విగ్రహాలకే పూజలు చేయాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను వాడవద్దని ప్రచారం జరుగుతుండడం కొద్దిగా ఫలితాన్ని ఇచ్చేనట్లేనని చెప్పవచ్చు. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రసార మాధ్యమాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలుచోట్ల చిన్నసైజు మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాదాపు అదే స్థాయిలో స్థానిక ప్రముఖులు కూడా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, స్థానిక ప్రముఖులు కార్యక్రమంలో పందిళ్ల వద్ద పూజలు నిర్వహించారు.

సందడే సందడి

మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులో రక్తదాతగా వినాయకుడు దర్శనమిచ్చాడు. ఇందులోని సామాజిక కోణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రైల్వేకోడూరు పట్టణంలో గణేశుడికి లక్ష రూపాయల నగదుతో తులాభారం ఏర్పాటు చేయడం విశేషం. అలాగే రాజంపేట, రాయచోటి, పీలేరు తదితర ప్రాంతాల్లో వందలాదిగా విగ్రహాలు కొలువుదీరాయి. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో వీధులన్నీ జనమయమయ్యాయి.



కడప బీకేఎం స్ట్రీట్‌లో గవ్వల గణేశుడు



ప్రొద్దుటూరు శివాలయంలో కొలువుదీరిన పంచవింశతి ముఖ మహా గణపతి



రైల్వేకోడూరు పట్టణం పాత బజార్‌లో నగదుతో లంబోదరుడికి తులాభారం

కొత్త వెలుగు

- ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు మోక్షం
- ఉద్యోగులకు ఆది నుంచి అండగా ప్రభుత్వం
- తొలి విడతలో 51 మందికి పోస్టింగ్
- తాజాగా 90 మందికి ఉపాధి కల్పించేందుకు కసరత్తు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీకి అనేక సంవత్సరాల పాటు సేవలందించి పలువురు కార్మికులు మృతి చెందితే గత టీడీపీ ప్రభుత్వం కనీసం బాధితులకు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదు. ఆయా ఉద్యోగుల కుటుంబాల సంక్షేమాన్ని పక్కన పెట్టేసింది. కారుణ్య నియామకాలు కల్పించాలని కోరితే గత ప్రభుత్వం మొండి చేయి చూపింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నపుడు ప్రజా సంకల్ప పాదయాత్రలో ఆర్టీసీ కార్మికులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లినపుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇచ్చిన మాటను నెరవేర్చారు. అలాగే అత్యధిక పింఛన్ తీసుకునేలా చర్యలు చేపట్టి ఆర్టీసీ ఉద్యోగుల్లో సంతోషాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలోనే ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టి బాధలో కూరుకుపోయిన ఆర్టీసీ కుటుంబాలకు శుభవార్త చెప్పారు. వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపారు. 2016 నుంచి 2019 వరకు తొలి విడతలో దాదాపు 51 మందికి వివిధ హోదాల్లో పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు.

మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు తీపి కబురు

ఆర్టీసీలో పనిచేస్తూ అనారోగ్యం బారిన పడి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. 19/2015 సర్క్యులర్ ప్రకారం మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది. ఎనిమిది సంవత్సరాల నుంచి ఈ నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది ఉండగా, జిల్లాలో 20 మంది వరకు ఎదురు చూస్తున్నారు. త్వరలో వీరికి కూడా తీపి కబురు అందించేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

మరోసారి 'కారుణ్యం'

ఏపీఎస్ ఆర్టీసీలో మృతి చెందిన ఉద్యోగుల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం మరికొందరికి కారుణ్య నియామకాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇటీవలే సర్కార్ నుంచి అనుమతులు రావడంతో అధికారులు ఫైల్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 2020 జనవరి, 1 తర్వాత 90 మంది మృతి చెందారు. ఆయా కుటుంబాలకు సంబంధించి కలెక్టర్‌కు నివేదికలను పంపించారు. త్వరలో నియామకాలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

నక్షత్ర తాబేళ్లు అప్పగింత



ములకలచెరువు : రెండు అడవి నక్షత్ర తాబేళ్లు దొరకడంతో స్థానికులు ఫారెస్టు అధికారులకు మంగళవారం అప్పగించారు. ఫారెస్టు బీటు అధికారి గోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మద్దినాయుని పల్లె పంచాయతీ వెంగన్నగారిపల్లెలో రమణప్ప పొలం వద్ద మంగళవారం రెండు నక్షత్ర తాబేళ్లు కనిపించాయి. రైతు రమణప్ప వాటిని ఫారెస్టు అధికారికి సమాచారం అందించి అప్పగించారు. స్వాధీనం చేసుకున్న అరుదైన తాబేళ్లను ఫారెస్టు అధికారి సంరక్షడవిలో వదిలిపెట్టారు. వర్షం కురవడంతో తాబేళ్లు జనావాసాల్లోకి వచ్చినట్లు ఫారెస్టు అధికారి పేర్కొన్నారు.

పట్టపగలే చోరీ



బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

వాల్మీకిపురం : పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వాల్మీకిపురం పట్టణంలోని తిరుపతి రోడ్డులో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకిపురం పట్టణం తిరుపతి రోడ్డుకు చెందిన రాజగోపాల్ పట్టణంలోని తరిగొండ రోడ్డులో ఉన్న సొంత నర్సరీలో పనులు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దుండగులు.. పట్టపగలే ఇంట్లో వెనుక వైపు నుంచి లోపలికి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాలను పగలగొట్టి అందులో ఉన్న రూ.1.30 వేల నగదు, 100 గ్రాములకు పైగా బంగారం అపహరించారు. దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న బాధితుడు రాజగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై క్రిష్ణమూర్తి కేసు నమోదు చేసి, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన పెద్ద దర్గా ఉరుసు

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతెహా





ఉరుసు ముగింపు ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతి, దర్గాలో సినీ గాయని నిత్య సంతోషిణి

కడప కల్చరల్ : కడప అమీన్‌పీర్ దర్గాలో హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరిరోజు సందర్భంగా దర్గా ప్రాంగణంలో పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేరుకుని గురువుల మజార్ వద్ద ప్రార్థనలు నిర్వహించి ఫాతెహా చేశారు. ప్రార్థనలనంతరం గంధం ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి వద్ద అనుమతి తీసుకుని తమ స్వస్థలాలకు తరలి వెళ్లిపోయారు.

గాయని ప్రార్థనలు

ప్రముఖ సినీ గాయని నిత్య సంతోషిని ఈ సందర్భంగా పెద్దదర్గాను దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి వచ్చిన ఆమెకు దర్గా ముజావర్ అమీర్ ఘనంగా స్వాగతం పలికి దర్గా చరిత్ర, విశేషాలను వివరించారు. ప్రధాన గురువులు, ఇతర గురువుల మజార్లతోపాటు ప్రస్తుతం ఉరుసు జరుగుతున్న హజరత్ అమీనుల్లా హుసేనీ సాహెబ్ మజార్‌ను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : ముగ్గురు ద్విచక్ర వాహనాల దొంగలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మహబూబ్‌బాషా విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రాయచోటి – సుండుపల్లె రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని, విచారణ చేయగా బైక్‌లు దొంగతనం చేసే వారిగా తెలిసిందన్నారు. రామాపురం మండలానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేటకు చెందిన షాజహాన్, తిరుపతికి చెందిన అనిల్ కుమార్‌గా గుర్తించామన్నారు. వీరు పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. తిరుపతి, బెంగళూరు, రాయచోటి ప్రాంతాలలో ఎనిమిది రాయల్ ఎన్‌ఫీల్డ్, టీవీఎస్ అపాచీ, టీవీఎస్ ఎక్సెల్ స్కూటర్లు దొంగలించినట్లుగా పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పెట్టినట్లు పేర్కొన్నారు. నిందితులను సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ నరసింహారెడ్డి ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారని వివరించారు.

'మీరు లేని జీవితం నాకెందుకు..!'

భార్యాబిడ్డలు దూరమయ్యారని వ్యక్తి ఆత్మహత్య



బాబ్‌జాన్ మృతదేహం

కురబలకోట : 'మీరు లేని జీవితం నాకెందుకు.. ఈ లోకం విడిచి వెళ్లిపోతున్నాను' అంటూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గజేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తంబళ్లపల్లెకు చెందిన షేక్ బాబ్‌జాన్ (40) భార్య, తొమ్మిదేళ్ల కుమార్తె ఆషియాతో కలసి మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికుడిగా ఉండేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో భార్య కుమార్తెను తీసుకుని మదనపల్లెలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడి నుంచి బతుకు దెరువు కోసం కువైట్ వెళ్లింది. భార్య, ఉన్న ఏకైక సంతానం కుమార్తె దూరమవడంతో ఒంటరి జీవితంపై విరక్తి చెందాడు. భార్యా బిడ్డ లేని జీవితం ఎందుకు.. ఇక ఎవరి కోసం బతకాలని ఆవేదన చెందాడు. కురబలకోట మండలం దాదంవారిపల్లె మార్గంలోని తూపల్లె బస్టాప్ సమీపంలో మగ్గంకు వాడే నూలు తోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. 'నా మృతికి కారణం ఎవ్వరూ కాదు.. ఐ మిస్ యూ ..' అంటూ సూసైడ్ నోట్ రాశాడు. మృతదేహానికి మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. పెద్దమండ్యం దళితవాడకు చెందిన నగేష్(26), నాగలక్ష్మి(30) ఉదయం సొంతపనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలో తురకపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, స్కూటర్ ఢీకొని..

రామాపురం : మండల పరిధిలోని బండపల్లె టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఆటో, స్కూటర్ ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని హసనాపురంలో జరిగే శుభకార్యానికి రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన 12 మందితో ఆటో వెళ్లింది. కార్యక్రమం తర్వాత అదే ఆటోలో వారు తిరుగు ప్రయాణమయ్యారు. టోల్ ప్లాజా వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనం ఆగి ఉండగా.. ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అహమ్మద్‌బాషా(68) తీవ్రంగా, జువేద్ (4), షర్మిల (38), ఫరహాన్ (10), షరీఫ్‌వున్నిసా(48) స్వల్పంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న రిజ్వానా(30) తీవ్రంగా, ఇమ్రాన్(32), ఇర్ఫాన్(11) స్వల్పంగా గాయపడ్డారు. వీరు రాయచోటి పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన వారు. కడప నుంచి రాయచోటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టైల్స్ యజమాని కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్ట్

- రెండు వాహనాలు, 4 సెల్‌ఫోన్లు, కట్టెలు, ఇనుపరాడ్లు సీజ్
- గంటల వ్యవధిలోనే కేసు ఛేదించడంపై ఎస్పీ అభినందన

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్‌కుమార్ కిడ్నాప్ కేసులో సోమ, మంగళవారాల్లో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్‌కుమార్ గుజరాత్‌లోని ఫ్యాక్టరీ యజమానులకు కడపకు చెందిన టైల్స్ వ్యాపారులు నాగబసిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌నాయుడులపై చాడీలు చెప్పి తీవ్ర ఆర్థికనష్టం కలిగించాడని కిడ్నాప్ ప్లాన్‌కు పథకం వేశారన్నారు. అందులోభాగంగా 17వ తేదీ ఆదివారం సాయంత్రం కడప టైల్స్ వ్యాపారులు నాగబసిరెడ్డి, అతడి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, అల్లుడు లోకేష్‌నాయుడు మరి కొంతమందితో కలిసి రెండు వాహనాల్లో అమ్మచెరువుమిట్ట ఆర్‌కే టైల్స్ దుకాణం వద్దకు చేరుకున్నారన్నారు. ఆ సమయంలో షాపులో ఉన్నటువంటి శ్రావణ్‌కుమార్, అతడి బావమరిది రమేష్‌లను బెదిరించి, తమకు కలిగిన నష్టంకు సంబంధించి రూ.30 లక్షలకు ఖాళీ ప్రాంసరీ నోట్లపై శ్రావణ్‌కుమార్‌తో సంతకాలు పెట్టించుకునే ప్రయత్నం చేశారన్నారు. కుదరని పక్షంలో అతడిని కారులో ఎక్కించుకుని ఏదైనా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకుపోయి భయపెట్టి, బెదిరించి డబ్బులు వసూలు చేసుకోవాలని, లేనిపక్షంలో చంపేయాలని నిర్ణయించుకున్నారన్నారు. పథకంలో భాగంగా నాగబసిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, డ్రైవర్ హబీబ్, లోకేష్‌నాయుడు, ఖాదర్, వినోద్‌లు కారులో, మరో వాహనంలో కట్టెలు, ఇనుపరాడ్లు వేసుకుని ఆర్‌కే టైల్స్ వద్దకు చేరుకున్నారన్నారు. ఖాళీ ప్రాంసరీ నోట్లపై సంతకం చేసేందుకు శ్రావణ్‌కుమార్ అంగీకరించకపోవడంతో అతడిపై దాడి చేసి, అడ్డువచ్చిన బావమరిది రమేష్‌ను గాయపరిచి, షాపులోని సీసీ కెమెరాల రికార్డర్ డీవీఆర్ సేఫ్టీ బాక్స్‌ను పగులగొట్టి ఇద్దరిని బలవంతంగా కారులో ఎక్కించుకుని కడప వైపు బయలుదేరారన్నారు. కిడ్నాప్‌పై సమాచారం అందుకున్న డీఎస్పీ కేశప్ప విషయం ఎస్పీ కృష్ణారావుకు తెలియజేసి, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారన్నారు. దీంతో కిడ్నాప్ జరిగిన గంటలోపే నిందితులను, కిడ్నాప్‌నకు గురైన శ్రావణ్‌కుమార్, రమేష్‌లను గుర్రంకొండ వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. ఘటనలో ప్రధాన నిందితులైన నాగబసిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌నాయుడులను సోమవారం అరెస్ట్ చేయగా, మంగళవారం కిడ్నాప్‌నకు సహకరించిన కడపకు చెందిన షేక్‌హబీబ్‌బాషా, ఖదీరుల్లా, బీహార్‌కు చెందిన నీరజ్‌సహాని, బికేష్‌కుమార్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి కిడ్నాప్‌నకు వినియోగించిన రెండు కార్లు, 4 సెల్‌ఫోన్‌లు, కట్టెలు, ఇనుపరాడ్లు, ఖాళీ ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. పరారీలో ఉన్న హబీబ్, ఖాదర్, వినోద్‌లను త్వరలోనే పట్టుకుంటామన్నారు. కిడ్నాప్ జరిగిన గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకుని కేసును ఛేదించడంపై డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

రాజస్థాన్ దివ్యాంగుడికి పింఛన్



వికలాంగ పింఛన్ అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యాపారికి వికలాంగ పింఛన్ మంజూరైంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పి.చెనారామ్‌కుమావట్ (33) అనే వ్యక్తి కొన్నేళ్ల నుంచి తరిగొండలో రెడిమేడ్ దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం తరిగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నడుము, కాళ్లు దెబ్బతిన్నాయి. దీంతో కొన్ని నెలలపాటు దుకాణం మూసివేశాడు. జీవనాధారం దెబ్బతినడంతో భార్య సాయంతో ఏడాది కిందట మళ్లీ దుకాణం తెరచి వ్యాపారం చేసుకొంటున్నాడు. రోజూ భార్య సాయంతో వీల్‌చైర్‌లో దుకాణానికి రావడం, సాయంకాలం మళ్లీ ఇంటి చేరుకోవడం జరుగుతోంది. జీవనం కష్టంగా మారింది. గ్రామంలో ఇటీవల ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటించినప్పుడు తన కష్టాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎంపీ వెంటనే అతడికి వికలాంగ పింఛన్ మంజూరు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అయితే అతనిది వేరే రాష్ట్రం కావడంతో కులధ్రువీకరణ సర్టిఫికెట్ మంజూరులో అధికారులకు చిక్కులు ఏర్పడ్డాయి. ఎంపీ చొరవ తీసుకొని సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించారు. ఈ నేపథ్యంలో అతనికి రూ.3 వేల వికలాంగ పింఛన్ మంజూరైంది. మంగళవారం స్థానిక సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సుందరలు పంచాయతీ కార్యదర్శి కల్యాణీలు చెనారామ్ దుకాణం వద్దకు వెళ్లి మంజూరైన పింఛన్ డబ్బు రూ.3 వేలు అందజేశారు. రాజస్థాన్ వ్యాపారి కుటుంబం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



కారు, ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు : కారుతో సహా రూ.7 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పీలేరు వైపు నుంచి చిత్తూరు వైపు ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పాటూరు వద్ద అటవీ శాఖ అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామున కారు రావడంతో సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకెళ్లి తేనెపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని ఆపి చీకటిలో పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా ఐదు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనంతోపాటు 144 కేజీల ఎర్రచందనం విలువ సుమారు రూ. 7 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఈ తనిఖీలో సిబ్బంది ప్రతాప్, చరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ, గుంటూరు జట్ల విజయం



మ్యాచ్ ఆడుతున్న విశాఖ, సెంట్రల్‌జోన్ జట్లు



ఈశ్వర్ రిత్విక్, విశాఖ జట్టు, (134 పరుగులు)



సుజాన్, నార్త్‌జోన్ జట్టు, (70 పరుగులు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–19 జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, గుంటూరు జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, సెంట్రల్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 134, యువన్ 60 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 49.2 ఓవర్లలో 241 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వరుణ్‌సాత్విక్ 91, అభినవ్ 80 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు శ్రీవర్ధన్ 4, అచ్యుతహేమంత్‌కుమార్ 3 వికెట్లు తీశారు. దీంతో విశాఖ జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది.

గుంటూరు జట్టు జయకేతనం

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 45.2 ఓవర్లలో 182 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రెడ్డిరుషీల్ 70, మనోజ్‌రాజు 53 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్ షేర్షా 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 41.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని తౌఫిక్ 59 పరుగులు చేశాడు. దీంతో గుంటూరు జట్టు 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

నార్త్‌జోన్ జట్టు జయభేరి

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్‌జోన్, కడప జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. జట్టులోని సుజాన్ 70 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ప్రణవ్‌రెడ్డి 2, అయూబ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 39.4 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ వర్మ 48 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు లోహిత్ 3, కార్తికేయ 3 వికెట్లు తీశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 45 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

తోడుకోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- లారీని ఢీకొన్న కారు
- యువకుడి దుర్మరణం



మృతి చెందిన శరత్‌సాయి

ముద్దనూరు : తన స్నేహితుడికి తోడు కోసం వచ్చి ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆగివున్న లారీని కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న (ఆదివారం) రాత్రి ఎర్రగుంట్లకు చెందిన బాబ్జీ అనే డ్రైవరు ముద్దనూరుకు కారును అద్దెకు తీసుకుని వచ్చారు. ముద్దనూరుకు వచ్చే సమయంలో.. బాబ్జీ తిరిగి ఇంటికి వెళ్లడానికి తోడుగా అదే గ్రామంలోని ఆశ్రమం వీధికి చెందిన శరత్‌సాయి(23)ని పిలుచుకుని వచ్చాడు. శరత్‌సాయి అన్న శశికాంత్ కూడా కారులో ముద్దనూరు వచ్చాడు. ఆదివారం రాత్రి 11.10 గంటలకు ముద్దనూరులో వ్యక్తిని వదిలి తిరిగి ముగ్గురూ కారులో ఎర్రగుంట్లకు బయలుదేరారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ దాటగానే రోడ్డు పక్కనే నిలిచివున్న లారీని కారు ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవరు పక్క సీటులో కూర్చున్న శరత్‌సాయి అక్కడికక్కడే చెందాడు. డ్రైవరు బాబ్జీ చేయి విరిగింది. బాధితుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు సైకిళ్లు ఢీకొని వ్యక్తి మృతి

కలికిరి : రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లికి చెందిన కె.లక్ష్మణరెడ్డి(60) తన సొంత పనుల నిమిత్తం కలికిరికి వచ్చి ద్విచక్రవాహనంలో తిరిగి వెళ్తున్నాడు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణరెడ్డికి తీవ్రంగా, మరో ద్విచక్ర వాహనంలో వెళుతున్న యువకులు భవానిప్రసాద్, గంగాధరకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మణరెడ్డిని పీలేరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి..



మృతి చెందిన పవన్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ నాగన్నకోట సమీపంలో మంగళవారం బైక్ అదుపుతప్పి ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ గాయత్రి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలం దాదంవారిపల్లికి చెందిన పవన్ (24), లక్ష్మీపతి బైక్‌పై వెళ్తుండగా మంగళవారం వేకువజామున అదుపుతప్పి కింద పడ్డారు. వాహనం నడుపుతున్న పవన్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న లక్ష్మీపతి తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మీపతిని ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి రాధమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో ఢీకొని..



మృతి చెందిన అరుణ్

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో జరిగింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన రమణ, ధనమ్మ కుమారుడు డి.అరుణ్(21) స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం వినాయకచవితి సందర్భంగా సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమలను స్నేహితుడు అఖిల్(21)తో కలిసి చూసేందుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా బాపూజీ పార్కు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్, అఖిల్‌లను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్నా పరిస్థితి విషమించడంతో అరుణ్ మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాశినాయన ఆశ్రమ అభివృద్ధికి చర్యలు



ఢిల్లీలో ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను కలిసిన ఎమ్మెల్సీ

కాశినాయన : కాశిరెడ్డినాయన ఆశ్రమ అభివృద్ధికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే ఈ అంశంపై కేంద్ర మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాయగా ... తాజాగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్‌అవినాష్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఢిల్లీలో కేంద్ర అటవీశాఖామంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలవనున్నారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో అపాయింట్‌మెంట్ విషయమై ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డిలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి మాట్లాడుతూ ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన జ్యోతిక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో పదేళ్ల క్రితం అటవీ అధికారులు ఫారెస్టు క్లియరెన్స్ లేదంటూ పనులు నిలుపుదల చేశారని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం 12.98 హెక్టార్ల భూమి ఆశ్రమ నిర్మాణానికి అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఫారెస్టు క్లియరెన్స్ కోసం కేంద్ర అటవీశాఖామంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ప్రతి ఏటా ఈ ఆశ్రమాన్ని సందర్శిస్తుంటారు. అయితే అటవీశాఖ అనుమతులు లేని కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ్రమ అభివృద్ధి కోసం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలోని నేషనల్ బోర్డు వైల్డ్‌లైఫ్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో అటవీశాఖ అనుమతుల విషయమై చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర అటవీశాఖామంత్రిని కలిసి సమస్యను వివరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎలాగైనా అటవీశాఖ అనుమతులు తెప్పించి ఆశ్రమ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.